# గాలి

శ్రీ ఎస్. సచ్చిదానందం

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

వేదకథాభారతి - 11

# గార్గి

రచన


శ్రీ సింగరాజు సచ్చిదానందం


ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య


ప్రచురణ

డాక్టర్ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 11

**GĀRGI**

by

***Vidwan S. Satchidanandam***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

Printed at
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens
Tirupati ✆ : 30184

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన! ఎంతటి ధార్మిక చేతన!'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -


ఈ వేద కథా భారతి.

వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ
వేద కథా భారతీ



# మనవి

వేద కథాభారతి.

అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించచడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య



# గార్గి

**వారే ఋషీకలు :**

ప్రతిభ దైవదత్తం. ఆ ప్రతిభకు స్త్రీపురుషభేదం లేదు. ప్రతిభావంతులు అన్ని కాలాలలోనూ అన్ని దేశాలలోనూ ఉన్నారు. అన్ని రంగాలలోనూ ఉన్నారు. పైగా వేదాంతవిద్యలో కూడా పరిణితలయిన బ్రహ్మవాదినులు లేకపోలేదు.

భారతీయులకు పరమ పవిత్రమయిన వేదంలో మంత్ర ద్రష్టలయిన స్త్రీలు ఉన్నారు. వారినే ఋషీకలంటారు. శ్లోకరచయిత్రులయిన మహిళలున్నారు. ప్రాచీనకాలంలో రోమశ, ఘోష, విశ్వవర, ఆత్రేయి, లోపాముద్ర, వసుక్రపత్ని, ఇంద్రాణి, అపాల, శ్రద్ధ, వైవస్వతి, యమి, పౌలోమి, సూర్య, స్వస్తి, శిఖండిని, ఊర్వశి, శచి, వాక్‌లాంటి ప్రతిభావతులెందరో. వారితో సాటిరాదగ్గ సాధ్వి 'గార్గి'.

**అసాధారణ వ్యక్తిత్వం :**

గార్గి వాచక్నుమహర్షి గారాబుబిడ్డ. తండ్రికేమో తన కుమార్తె వాగ్మిగా, విదుషీమణిగా, వివేకవతిగా, విశిష్టవ్యక్తిగా రాణించాలని ఆకాంక్ష. అందుచేత తన భావాలకు అభిరుచులకు తగ్గట్టు వాచక్ను గార్గిని పెంచాడు. తండ్రి ప్రోత్సాహం, ఆశ్రమవాతావరణం గార్గిలో ఆత్మస్థైర్యాన్ని పెంచినాయి. ఆశ్రమాగతులయిన వారి సాహచర్యం ఆమెలో

అధ్యాత్మవిద్యానురక్తిని పెంచింది. మునుల దీవెనలు మోక్షజిజ్ఞాసను కలిగించాయి. ఋషుల తపస్సులు ఋజుత్వాన్ని ఆమెకు కలిగించాయి. బ్రహ్మచారిణులతో సంవాదం పరమనిష్ఠకు సోపానమయింది. అలాంటి గార్గిసౌజన్యం తపోధనులకు ఆశ్చర్యం కలిగించింది. గార్గిదీక్షకు సంయమి శ్రేష్ఠులు సంతోషించారు. గార్గి వాదబలానికి సహచరులు నిరుత్తరులయ్యారు. గార్గి వైదుష్యానికి సహపాఠకులు తలలుదించారు. క్రమంగా గార్గి కీర్తి ఆశ్రమం దాటింది. మునిపల్లెల్లో ధ్వనించింది. నగరం పొలిమేరల్లో తచ్చాడింది. కోటగోడల్లో విహరించింది. కొలువుకూటందాకా ప్రాకింది. రాజాస్థానాలలో మన్ననలు అందుకుంది. గార్గి ప్రతిభ రాణించే రోజు రానే వచ్చింది.

**జనకుని జిజ్ఞాస :**

అది జనక చక్రవర్తి సభ, మిథిలానగరంలో మిన్ను ముట్టిన కొలువు కూటం. ఆ సభలో ధర్మజ్ఞులున్నారు. వేదాంతులున్నారు. నీతికోవిదులున్నారు. సకలకళాపారంగతులున్నారు. సర్వవిద్యా విశారదులున్నారు. పౌరాణికులున్నారు. లాక్షణికులున్నారు. తపోవరిష్ఠులున్నారు. కర్మనిష్ఠులున్నారు. ఋత్విక్కులున్నారు. పరమార్థ చిత్తులున్నారు. ఆ సభ కిటకిటలాడుతూ ఉంది. జనక చక్రవర్తి సింహాసనంలో కూర్చొన్నాడు. పేరుకు రాచరికమే గాని అంతకంటె పెద్దరికం అతనిలో కనిపిస్తుంది. కరవాలంతో కాకుండా కనికరంతో పాలించే కర్మిష్ఠుడాయన. చతురంగబలంతో కాకుండా చాతుర్యంతో రాజ్యాన్ని పాలించే రాజాధిరాజు ఆయన. హింసలతో, వంచనలతో కాకుండా హిత బోధలతో శాసించే రాజర్షి ఆయన. సమస్తం పరబ్రహ్మగా భావిస్తూ

సార్వభౌముడుగా విఖ్యాతిగడించినవాడు ఆయన. ఆయన సంపదలు దానం కోసం కాని అనుభవించడానికి కావు. వ్యర్థాలాపాలతో కాకుండా ఆధ్యాత్మిక రహస్య శ్రవణంతో కాలం గడపడమే జనకుని ప్రవృత్తి. అలాంటి జనకుడు తన కొలువుకూటానికి వచ్చే వారిని నిశితంగా పరిశీలించేవాడు.

ఒకసారి జనకుడు ఒక యాగం చేశాడు. ఆ యాగానికి కురుపాంచాల దేశాలనుండి ఎందరో వేదపండితులు వచ్చారు. యాగం పరిసమాప్తమైంది. కాని జనకునికి సంతృప్తికలగలేదు. అతణ్ణి ఒక సందేహం పీడించసాగింది. వీరు వేద వేదాంతాలలో పండితులు కదా! వేదతత్త్వం తెలిసినవారు వీరిలో ఎవరు? అని ఆలోచించసాగాడు. సభలోని పండితులలో బ్రహ్మవేత్త ఎవరో తెలుసుకోవాలనుకొన్నాడు. అయినా ఈ పరీక్షకు తాను నేతకావడానికి ఇష్టంలేదు. ఇది పండితులమధ్య తేలవలసిన అంశం. ఆస్థానం అత్యంత ప్రతిష్ఠాకరమయిన స్థానం. అందుచేత ఆలోచించాడు. ఒక ఉపాయంపన్నాడు.

## ఆధ్యాత్మికచర్చకు ఆలమందల పారితోషికం :

కొలువుకూటానికి దగ్గర్లో ఒక విశాలమైన మైదానం. ఆ మైదానంలో వేయి ఆవులున్నాయి. ఆవులన్నీ కళకళలాడుతున్నాయి. ఆవుల మీద స్వర్ణాభరణాలు ప్రకాశిస్తున్నాయి. కొమ్ములకు ధనం సంచులున్నాయి. ఆవుల అంబారవంతో ఆప్రదేశమంతా శ్రవణయోగ్యంగా వుంది: ఆవుల వన్నె చిన్నెలతో ఆప్రదేశం సుందరోద్యానవనంలా ప్రకాశిస్తూ వుంది. వాటిని ఆవులనడం తగదు. తిరిగే మేరుపర్వతాలు. అంతేకాదు సమృద్ధిగా పాలిచ్చే క్షీరసముద్రాలు.

సాధుస్వభావంతో మునీశ్వరుల్ని తలపించే గోవ్రాతలు. ఈ ఆలమందలెందుకో అర్థం కాలేదు ఎవరికీ. ఎవరికి తగ్గట్టు వారు తమలో తాము తర్కించుకొన్నారు.

పుణ్యవ్రతం పూర్తిచేసి దానాదులకోసం సిద్ధం చేశారేమో అని అనుకొన్నారు పేద బ్రాహ్మణులు. విశిష్టయాగం కోసం సకల సంభారాలతో గోసంపదను కూడా సమకూర్చారేమో అని అనుకొన్నారు హోతలు కొందరు. ఉత్తములయిన వారిని ఎంపికచేసి సత్కరిస్తారేమో అని అనుకొన్నారు సామాన్యులు. అయితే సామాన్యుల ఆలోచనలే సత్యం.

జనకుడు సభాసదుల్ని సూక్ష్మంగా పరిశీలించాడు. సభలో అశ్వలుడు, భుజ్యువు, అహోలుడు, శాకల్యుడు, విదగ్ధుడు ఉన్నారు. అందరికంటె మిన్నగా యాజ్ఞవల్క్యుడు ఠీవిగా కనిపించాడు. అందరిని తేరిపారి చూశాక జనకమహారాజు సభకు నమస్కరించాడు.

'మహాత్ములారా! ఇది కేవలం సభాంగణం మాత్రంకాదు. సద్విషయ చర్చాంగణం. సుమనస్సుల విహారాంగణం. సత్యశీలుర ప్రాంగణం. మీరందరు ఉత్తములే. బ్రహ్మజ్ఞులే. కాని మీలో బ్రహ్మవేత్తలు ఎవరో తేల్చేశక్తి నాకు లేదు. మీలో బ్రహ్మవేత్త అయిన వారికి కొలువుకూటం వెలుపలి మైదానంలోని వేయి గోవులను అర్పిస్తాను' అన్నాడు.

సరస్సులో అలల్లాగా సభలో కలకలం మొదలయింది.

భుజ్యుడు తలవంచాడు.

అహోలుడు దిక్కులు చూచాడు.

శాకల్యుడు సభ అంతా పరిశీలించాడు.

అయినా సాహసం చేయడానికి ఎవరూ సంసిద్ధం కాలేదు.

యాజ్ఞవల్క్యుడు జనకుని ప్రకటన విన్నాడు. సభాంగణం అంతా చూచాడు. సహచరుల మనోభిప్రాయాల్ని అర్థం చేసుకొన్నాడు. శిష్యుల ముఖ కమలాలపై విరిసిన చిరునవ్వుల్ని పసిగట్టాడు. పండితుల దిగాలునూ పరిశీలించాడు. అతనిలోని బ్రహ్మతేజం అడుగువేయమంటూవుంది. పాండిత్యం ముందుకు తోస్తూ వుంది. వినయం తొందరపడవద్దని మందలిస్తూ వుంది. ఆగాడు.

కాలం గడుస్తూ వుంది.

జనకుడు మరోసారి అందరిని చూచాడు. యాజ్ఞవల్క్యునిపై దృష్టి ఆనింది. అశ్వలునిపై చూపు పారింది.

ఇంక ఆలోచించడం తగదనుకొన్నాడు యాజ్ఞవల్క్యుడు. తన ప్రియశిష్యుడైన సామశ్రవుని వైపు చూచాడు. సామశ్రవుడు సామాన్యుడు కాడు. వేదంలోని సామభాగాన్ని సలక్షణంగా అధ్యయనం చేసినవాడు. అతని ముఖం చంద్రునిలా ప్రకాశిస్తూ వుంది. వెంటనే యాజ్ఞవల్క్యుడు లేచి-

*'మహారాజా! సభలో నేనొక్కణ్ణే బ్రహ్మవేత్తను. ఆధ్యాత్మ విద్యావిశారదుణ్ణే. అందుచేత ఈ వేయి గోవుల్ని నా ఆశ్రమానికి నా శిష్యుడు తరలించడానికి అనుమతి ఇవ్వండి'*

అని గంభీరంగా పలికాడు.

సభ నిశ్శబ్దంగా ఉంది. జనకుడు కాసేపు మౌనం వహించాడు. మౌనం అర్ధాంగీకారమంటూ సామశ్రవుడు గోవుల్ని తరలించడానికి సన్నాహాలు చేస్తుంటే అశ్వలుడు అడ్డుపడ్డాడు.

అశ్వలుని ఆర్భాటం :

'యాజ్ఞవల్క్యా! ఆగు! ఆగు! ఉత్తముడవని నీవే ప్రకటించుకోవడం న్యాయం కాదు. ఇది సభాంగణం. నేను జనక మహారాజు ఋత్విక్కును. యాగాదులెన్నో. జరిపించినవాణ్ణి. క్రతువిద్యావిశారదుణ్ణి. నీవు విద్వాంసుడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పు'

అని గర్జించాడు.

యాజ్ఞవల్క్యుడు అశ్వలుని చూచాడు. అశ్వలుడు పురోహితుడేగాని పరమార్థజ్ఞానంలేని వాడని పసిగట్టాడు. అందుచేత చేతులు జోడించి-

''అశ్వలా! నేను సంసిద్ధుణ్ణి. నీ ప్రశ్నలకు సమాధానం చెబుతా'' అన్నాడు.

''బ్రహ్మ తత్త్వమంటే ఏమిటి?''

అడిగాడు అశ్వలుడు గట్టిగా.

''అశ్వలా! నాకు తెలియదు. నేను బీదబ్రాహ్మణుణ్ణి. ఆవులు నాకు అవసరం'' అన్నాడు.

అశ్వలుడు పక పకా నవ్వాడు. కాని సభలోనివారు యాజ్ఞవల్క్యుని మాటల్లోని అంతరార్థం గ్రహించి భేషన్నారు. అశ్వలునికి ఆ వ్యంగ్యం అర్థం కాలేదు. తనకు తెలిసిన యాగాల్ని, యాగ విశేషాల్ని, అధిష్ఠాన దేవతల్ని, కర్మక్రియాకలాపాల్ని గురించి గుచ్చిగుచ్చి అడిగాడు.

యాజ్ఞవల్క్యుడు నింపాదిగా జవాబులు చెప్పేసరికి అశ్వలుడు ఖంగుతిన్నాడు. ఇంక అడగడానికి ఏమీ లేకపోవడంతో అశ్వలుడు వెనకడుగు వేశాడు.

**నారీజనంలో కలకలం :**

ఈలోగా నారీజనంలో కల కలం మొదలయింది.

అందరి చూపులు అటుకేసి మళ్ళాయి.

ఆ నారీ జనంలోఆర్ష విద్యా స్వరూపిణిగా' ఒక స్త్రీ మూర్తి కూర్చొని ఉంది. ఆవిడను చూసి-

'సరస్వతీ సారూప్యమ' న్నారు కొందరు.

'తపస్సు స్త్రీ రూపం ధరించింద' ని అన్నారు కొందరు.

'వేదమాత సభాంగణానికి విచ్చేసింద' ని అన్నారు ఇంకా కొందరు.

యాజ్ఞవల్క్యుడు కూడా అటుకేసి చూశాడు. ఆమె వాచక్నుని కుమార్తె అని గుర్తించాడు. ఆమె ఎవరో కాదు గార్గి. మైత్రేయిలాగా అధ్యాత్మవిద్యారహస్యం తెలిసిన అద్వితీయ సాధ్వీ శిరోమణి.

**జిజ్ఞాసతో రెండు ప్రశ్నలు :**

గార్గి యాజ్ఞవల్క్యుని చూచింది. అతని తపశ్శక్తికి మెచ్చింది. అశ్వలుని ప్రశ్నలకు అతడిచ్చిన సమాధానం గుర్తించింది. అయినా బ్రహ్మవేత్త అనడానికి ఆ కొలబద్దలు చాలవనుకుంది. ఎదుటివారి సందేహాలను తీర్చగలిగే వాడే పండితుడు. సత్యదర్శనం చేసినవాడే సద్విమర్శకుడు. బ్రహ్మస్వరూపం తెలిసినవాడే బ్రాహ్మణుడు. అందువల్ల గార్గి లేచి-

*'మహారాజా! నేను స్త్రీని. గార్గిని. ఆధ్యాత్మిక అంశాలపై నాకు కొన్ని సందేహాలున్నాయి. వాటిని తీర్చుకోవడం కోసమే నేనిక్కడకి వచ్చాను. అనుమతిస్తే యాజ్ఞవల్క్యుల వారిని అడుగుతాను'*

అంది.

సభలో అలజడి మొదలయింది.

ఎవరూ ఊహించని సన్నివేశం.

ఒక మహర్షిని ఒకానొక స్త్రీ చొప్పదంటు ప్రశ్నలు అడగడమా అని నిరసించారు కొందరు.

*'బ్రాహ్మణోత్తముడని తేలిన తరువాత ఏమిటీ అనవసర ప్రసంగం'*

అన్నారు సామశ్రవాదులు.

తన ఆశ చావనందుకు అశ్వలుడు సంతోషించాడు.

నారీజనం లోలోపల సంతోషపడుతూ వుంది.

జనక చక్రవర్తి గార్గిని, మహర్షిని కూడా చూచాడు-

*'ఓ మహర్షీ! ఇది విద్వత్సభ. సరస్వతి విద్యాస్వరూపిణి. ఈ సభలో ఎవరయినా ఏదయినా అడగవచ్చు. సందేహాలు తీర్చుకోవచ్చు.'*

అన్నాడు.

యాజ్ఞవల్క్యుడు సరేనన్నాడు.

గార్గి మహర్షిని చూచి-

*'మహాత్మా! మనం చూసే ఈ జగత్తులో ఎంతో వస్తుజాలం కనిపిస్తుంది. వీటికి ఆధారభూతం ఏదంటారు?'*

అంది.

గార్గి ప్రశ్నలోని అంతరార్థాన్ని గుర్తించాడు యాజ్ఞవల్క్యుడు.

*'ఆకాశం సమస్తవస్తుజాలానికి ఆధారభూతం'*

అన్నాడు.

*'అయితే ఆకాశమనే పదార్థం ఎక్కడ వుంది?'*

మరో ప్రశ్న వేసింది.

*'ఎక్కడేమిటి? గంధర్వలోకంలో'*

అన్నాడు.

‘ఆ గంధర్వలోకం ఎక్కడుంది?’

‘‘సూర్యలోకంలోనే’’

‘‘అదెక్కడుంది?’’

‘‘చంద్రమండలంలో’’

‘‘చంద్రమండలం ఎక్కడుంది?’’

‘‘నక్షత్రమండలంలో’’

‘‘నక్షత్రమండలం ఎక్కడుంది?’’

‘అది దేవతల లోకంలో’

అన్నాడు.

‘దేవలోకం ఎక్కడుంది?’

మరల ప్రశ్నించింది గార్గి.

‘ఇంద్రలోకంలో ఉంది’

‘ఇంద్రలోకమెక్కడ ?’

‘ప్రజాపతి రాజ్యంలో’

‘ప్రజాపతి రాజ్యమెక్కడ?’

‘అది బ్రహ్మలోకంలో’

‘బ్రహ్మలోకం ఎక్కడ?’

స్థిరంగా అడిగింది గార్గి.

ఈ సంవాదంతో మహర్షి చిరాకుపడ్డాడు.

**తలపగిలి నేల పడుతుంది :**

> *''గార్గీ! చొప్పదంటుప్రశ్నలు వెయ్యకు. ఈ ప్రశ్నలకు అంతూ పొంతూ అసలుండవు. ఆది అంతాలు లేని ప్రశ్నలు ఎప్పుడూ ఉంటాయి. అసందర్భప్రసంగం పనికిరాదు. వీటికి జవాబు చెప్పడం వ్యర్థం. ఇలా అడుగుతూపోతే తలపగిలి నేల పడుతుంది''*

అన్నాడు మహర్షి.

మహర్షి మాటలకు గార్గి బెదిరింది. వెనకకు తగ్గింది. అయినా ఊరుకోలేదు. ధైర్యం తెచ్చుకొంది.

జనక చక్రవర్తి ఈ ప్రశ్నపరంపరని జాగ్రత్తగా గమనిస్తున్నాడు. సభ పెడదారి పట్టడం జనకునికి నచ్చలేదు. అదీగాక ఆడవారిని హతాశలు చేయడం కూడా ఇష్టం లేదు. అందుచేత గార్గిని చూచి-

> *'గార్గీ! ప్రస్తుతాంశం బ్రహ్మవేత్త ఎవరనే నిష్కర్ష మాత్రమే. అందుచేత ఇంకా ఒకటి, రెండు ప్రశ్నలు అడగడానికి మాత్రం సమ్మతిస్తున్నానని'*

చెప్పాడు. గార్గి తల వూపింది.

> *''మహర్షీ! మహారాజు ఆదేశించినట్లు రెండే రెండు*

*ల్ని అడుగుతున్నాను. ప్రశ్నల్ని బాణాలతో పోల్చడం సహజం. కారణం ఇది వాగ్వివాద సభ. వాదబలమే అస్త్రబలం. కాశీపట్టణంలో లేదా విదేహ ప్రాంతంలో బాణాలను ప్రయోగించేవారిని మీరు చూసి వుంటారు. వారు సకల కళా విశారదులు. వారి గురి తప్పదు. అందుచేత రెండే ప్రశ్నల్ని అడుగుతాను''*

అంది.

యాజ్ఞవల్క్యుడు సమ్మతించాడు.

*'ఆకాశానికి పైన వున్నదీ, భూమికింద వున్నదీ, భూవ్యాకాశాలకు మధ్యన ఉన్నదీ ఏమిటో వివరించండి'*

అని ప్రశ్నించింది.

పండితపుంగవులంతా ఊపిరి బిగపట్టారు. ఇందాకా గార్గి అడిగిన ప్రశ్నలలోని పీఠికాభాగం ఇప్పటికి అర్థమయింది.

సభలో జిజ్ఞాస పెరిగింది.

అదే అక్షరబ్రహ్మ :

*'గార్గీ! ఆకాశం ఒకటే. అది సర్వవ్యాపకం. గతంలో, వర్తమానంలో భవిష్యత్తులో కూడా నిరంతరం ఉండే*

తత్త్వం ఆకాశం ఒకటే'

అన్నాడు.

'అయితే మరో ప్రశ్న అడుగుతున్నా.'

'మహానుభావా! భూతభవిష్యద్వర్తమానాలకు గుర్తులేవి?'

అదే పరబ్రహ్మం. అది చిన్నదీ కాదు పెద్దదీ కాదు. పొడుగూకాదు పొట్టీకాదు. నలుపూ కాదు ఎరుపూ కాదు. దానికి రంగులు లేవు. రుచులు లేవు. వాసనలు లేవు. కళ్ళకు కనబడేది కాదు. ఎవరూ భుజించలేనిది అది. ఆ శక్తే సూర్యచంద్రుల్ని నడిపిస్తుంది. అది అగ్నిలా అరుణిమ కాదు. జలంలా తరళమూ కాదు. దానికి ఛాయా తిమిరాలు లేవు. అదే అక్షర బ్రహ్మ'.

**అక్షయం; అనంతం :**

'ఈ బ్రహ్మయే కాలాన్ని నడిపిస్తుంది. భూమ్యాకాశాల్ని క్రమపద్ధతిలో తిరిగేలా చేస్తుంది. దీనివల్లనే దివారాత్రులు, వారాలు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు, మన్వంతరాలు ఏర్పడుతున్నాయి. ఈ అగోచర శక్తివల్లనే కొన్ని నదులు తూర్పు పడమరలుగా, మరికొన్ని పడమర తూర్పులుగా పయనిస్తున్నాయి. చివరకు సాగరగర్భంలో కలుస్తున్నాయి. ఈ అక్షర బ్రహ్మ కనబడదు. కానీ అన్నిటినీ చూస్తుంది. వినబడదు గాని అన్నింటిని

వింటుంది. తానెవరికీ తెలియదు గాని తనకు అన్నీ తెలుసు. అది అక్షయం. అనంతం. చిరంజీవి. మహాశక్తి సంపన్నం'

అని యాజ్ఞవల్క్యుడు సృష్టిరహస్యం చెప్పాడు.

ఈ సమాధానంతో గార్గి సంతృప్తి పడింది. తన సందేహాలు తీరినట్లు స్పష్టం చేసింది. యాజ్ఞవల్క్యుడు బ్రహ్మవిదులలో ఉత్తముడని 'బ్రహ్మను' తెలుసుకొన్నవాడని నమ్మింది.

సభ మహర్షికి జేజేలు పలికింది.

జనకమహారాజు సంతోషించాడు.

ఆధ్యాత్మిక రహస్యాలు తెలిసినందుకు ఆనందించాడు.

## గార్గి గార్హస్థ్యం :

గార్గి పేరు దశదిశలూ వ్యాపించింది. ఆమె మేధస్సుకు పండితులు మెచ్చుకొన్నారు. గార్గి విదుషీమణి అయింది. వాదబలానికి బ్రహ్మచారిణిలా జీవించాలని అనుకొంది. కుమార్తె నిర్ణయం తండ్రికి నచ్చలేదు. తన కుమార్తె విద్యావతి కావాలని కోరుకొన్నాడేగాని అవివాహితగా కాలం గడపటం అతణ్ణి బాధ పెట్టింది. ఎన్నోసార్లు నచ్చచెప్పాడు. కాని ఫలితం శూన్యం. గార్గికి బాల్యం ఎపుడో గడచింది. యౌవనం జారిపోతూ వుంది. వృద్ధాప్యం స్వాగతం పలుకుతూ వుంది. కాని ఇవేవీ పట్టించుకోకుండా గార్గి సన్యాసదీక్షతో, ధ్యానంతో కాలం గడుపుతూ ఉంది.

ఒకనాడు నారదుడు వచ్చాడు.

గార్గి నారదునికి అతిథిసత్కారాలు చేసింది.

నారదుడు సంతోషించాడు.

'అమ్మా! జీవితం క్షణభంగురం. వయోదార్ఢ్యం నిలిచేది కాదు. సుఖభోగాలు జీవికి అవసరం. ఈ నియతి అందరికీ సమానం. అందుచేత పెళ్ళాడవమ్మా'

అన్నాడు.

గార్గి నారదునికి నమస్కరించింది.

'మహర్షీ! పురుషులకూ స్త్రీలకూ భిన్న భిన్న ఆచారాలు లేవు. సాంసారిక జీవితం గడపకుండా సన్యాసులయినవారెందరో. అలాగే నేను సన్యాసినినయ్యాను. ధ్యానంతో ముక్తి పొందాలని నాప్రగాఢవాంఛ'

అంది.

అపుడు నారదుడు-

'అమ్మా! నీ ఆలోచన బాగుంది గాని, వాదనలకు నిలవదు. పురుషులకు ఇది సాధ్యం కాని స్త్రీలకు సాధ్యం కాదు. స్త్రీ ధర్మాలు వేరు. పురుష ధర్మాలు

వేరు.(యాజ్ఞవల్క్యుడు స్త్రీలకెన్నో నియమాలు చెప్పాడు.) యుక్తవయసువచ్చాక ఆడపిల్ల తన భర్తను తానే నిర్ణయించుకోవచ్చునన్నాడు. మగబిడ్డలు లేకుండా ఎవరయినా చనిపోతే అతనికి నిజమయిన వారసులు అతడి భార్య, అతని కూతుళ్ళు మాత్రమే అని అనుశాసించాడు. యాజ్ఞవల్క్యుడు బ్రాహ్మణోత్తముడు కదా! జనకమహర్షి సత్కారాలు అందుకొన్న మహనీయుడు కదా! అంచేత వివాహమాడవమ్మా'

అన్నాడు.

'అంతే కాదు. వివాహితకాని స్త్రీ దేహం అపవిత్రం. వారికి మోక్షప్రాప్తి లేదు' అని నిక్కచ్చిగా చెప్పాడు.

**ఒక్కరోజు మాత్రమే :**

గార్గి ఇబ్బందిలో పడింది. ధర్మోపదేశంచేసేవాడు దేవర్షి. సకలశాస్త్ర మర్యాదలు తెలిసిన సత్పురుషుడు. తాను కోరేదేమో ముక్తి. ఆ ముక్తి అవివాహితులకు రాదనడం అంతుపట్టని అంశంగా భావించింది.

గార్గి తనలో తాను వితర్కించుకొంది,

తను ఏకాకి. తనకు తనవారంటూ ఎవరూ లేరు. తానే మగని కోసం వెదకసాగింది. చివరకు 'శృంగవంతు' డనే మునిని చూచింది.

శృంగవంతుడు గార్గిని పెళ్ళాడడానికి ఇష్టపడ్డాడు. గార్గి ఒక నిర్ణయానికి వచ్చింది-

'మహర్షీ! నేను నారదోపదేశానుసారం వివాహం చేసుకోవాలను కొంటున్నాను. నాకు సంసారంపై రక్తి లేదు. కుటుంబజీవితంపై అనురక్తి కూడా లేదు. మన వైవాహికజీవితం ఒక రోజు మాత్రమే. అందుకు సమ్మతిస్తే నిన్ను పెళ్ళాడతాన'న్నది.

శృంగవంతుడు ఆలోచించాడు.

'గార్గీ! నేను ఒక్కరోజు కోసం నిన్నెందుకు పెళ్ళాడాలి? పెళ్ళాడి శాశ్వతంగా 'ఏకాకిగా' అవివాహితునిలాగా ఎందుకు జీవించాలి? అందువల్ల నాకు ఒరిగిందేమిటి?' అన్నాడు.

'శృంగవంతా! ఇది నారదోపదేశం. నా తపస్సులో సగం నీకు ధారపోస్తాను. నీవు చరిత్రలో చరితార్థుడివిగా మిగిలిపోతావు. నా భర్తగా చరిత్రలో నీ పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది' అంది.

గార్గీ శృంగవంతుల వివాహం జరిగింది.

మాటప్రకారమే ఒకరోజు 'కాపురం' గార్గి గడిపింది. మగనిని వదలిపెట్టడానికి నిశ్చయించింది.

కాని శృంగవంతుడు-

'గార్గి! ఇది తగదు. ఆలోచించు. మరి కొంతకాలం నాతో జీవించు. ఇదే నా కోరిక' అని దీనంగా ప్రార్థించాడు.

**మహోన్నత వ్యక్తిత్వం :**

కాని గార్గి ఒప్పుకోలేదు. ఆమె మగనిని వదిలింది. సన్యాసిని అయింది. ధ్యానంతో ముక్తి పొందింది.

బృహదారణ్యక ఉపనిషత్తులో శాశ్వతస్థానం సంపాదించుకొన్న బ్రహ్మవాదినులలో గార్గి ఒకతె.

వ్యాకరణశాస్త్రంలో కూడా పాణిని గార్గిని ఉదాహరించాడు.

ఆత్మస్థైర్యంతో, మనోబలంతో, యుక్తి యుక్త వాదనలతో ఏలాంటి వారినైనా ప్రశ్నించగలిగిన వనితామణులలో గార్గి ప్రథమ గణ్య.

చరిత్రలోనే వాగ్మిగా, విదుషీమణిగా, స్థిరచిత్తగా నిలచిన మహోన్నత వ్యక్తి 'గార్గి'.

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

❀ ❀ ❀

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

CENTENARY CELEBRATIONS OF SRI VENKATESWARA VEDAPATHASALA

★ DHARMAGIRI ★

&

VEDA AGAMA SILPA SADAS

5-7-1999 To 8-7-1999